క్లుప్తంగా

క్యాన్సర్ రోగికి వసుధ విరాళం



క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ద్వారకాతిరుమల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాలపాకల శ్రీనుకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10వేలు విరాళం ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా క్యాన్సర్ రోగి శ్రీను తమ్ముడు వెంకటేశ్వరరావుకి అందజేశారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెద్ద ఎత్తున చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తలనీలాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న న్యాయవాది నెక్కంటి క్రాంతికుమార్

నరసాపురం రూరల్: విద్యార్థుల సంక్షేమం కోసం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని న్యాయవాది నెక్కంటి క్రాంతి కుమార్ అన్నారు. నరసాపురం పట్టణంలోని బీసీ సంక్షేమ హాస్టల్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షమ పథకాల అమలు కోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సుందర్, బండి పెద్దిరాజు, మనోజ్, సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంఘం ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు సంఘ రాష్ట్ర నాయకులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో శనివారం రాష్ట్ర తూర్పుకాపుల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న విశాఖపట్నం గాజువాకలో జరగనున్న తూర్పుకాపుల సమావేశానికి చేయవలసిన కార్యాచరణపై రాష్ట్ర కమిటీ సభ్యులు స్థానిక నాయకులతో చర్చించినట్లు సంఘ రాష్ట్ర నాయకుడు లోపింటి చిరంజీవి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కరుమజ్జి మల్లేశ్వరరావు, కురిటి మాధవ నాగేశ్వరరావు, శ్యామ్ మాస్టర్‌లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాకూరి నిరంజన్, పిల్లా సత్తిబాబు, ధనాని సూర్యప్రకాష్,, మామిడి సత్యనారాయణ, రెడ్డి చిన్ని, జమ్ము కాసి, శిడగం సురేంద్ర, రుంకాని విష్ణుప్రసాద్, కిలారి వాసు పాల్గొన్నారు.

సాయి భక్తుల తీర్థయాత్ర

కాళ్ల: అధిక శ్రావణమాసం ఏకాదశి మహాపర్వదినాన్ని పురస్కరించుకొని సాయిబాబా సేవకులు పుణ్యక్షేత్రాలకు శనివారం బయల్దేరారు. సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో బయలుదేరిన సాయిభక్తులు 52 వారాలు సేవచేసి 53వ వారంలో బస్సుల్లో యాత్రగా వెళ్లారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలోని షిర్డీసాయి దేవస్థానం నుంచి సుమారు 300 మంది సాయి సేవకులు, భక్తులు బయల్దేరారు. తొలుత బాబావారికి ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన మాస్ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నాయన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లతో రక్తహీనతకు చెక్



యలమంచిలిలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ (ఫైల్)



గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పది రకాల వస్తువుల కిట్‌లు

ప్రాజెక్ట్	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	
మొగల్తూరు	193	1165	1018	2183
పాలకొల్లు	258	1195	905	2100
మొత్తం	451	2360	1923	4283

- గర్భిణులకు బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్ల అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న గర్భిణులు

యలమంచిలి: పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుంది. ఆరోగ్యవంతమైన యువత ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి వేగంగా ఉంటుందనేది ఆర్థిక నిపుణుల మాట. అటువంటి సమాజ నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం తయారుచేసి గర్భిణులు, బాలింతలకు పెట్టేవారు. అయితే చాలామంది అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఆహారం తీసుకోవడానికి ఆసక్తి కనపరచడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో రేషన్ కిట్‌లను నేరుగా వారికే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 2 నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించింది.

పోషణ కిట్ ఇలా

ప్రతి నెల మూడు కిలోలు బియ్యం, కిలో కంది పప్పు, అర లీటరు వంట నూనె, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు, 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో ఖర్జూరం, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చిక్కీలు పంపిణీ చేస్తారు. పాలు, గుడ్లు మాత్రం రెండు విడతలుగా ఇస్తారు.

451 కేంద్రాల్లో లబ్ధిదారులు

నరసాపురం రెవెన్యూ డివిజన్‌లో రెండు మొగల్తూరు, పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో మొత్తం 451 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 2360 మంది గర్భిణులు, 1923 మంది బాలింతలు ఉన్నారు. వారందరికీ ఇప్పటి వరకు స్పాట్ ఫీడింగ్ ఇచ్చేవారు. ఇక నుంచి టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) ఇస్తున్నారు. టీహెచ్‌ఆర్‌లో ఉన్న పది రకాల ఆహార పదార్థాల కిట్ విలువ రూ.900 ఉంది. ఈ లెక్కన ఒక్క నరసాపురం డివిజన్‌లోని మొగల్తూరు, పాలకొల్లు ప్రాజెక్ట్ పరిధిలోని 4283 మంది గర్భిణులు, బాలింతలకు నెలకు రూ.17.33 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.2.08 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరిస్తాయి. అయితే పంపిణీ చేసే పది రకాల్లో ఐదు రకాలు బియ్యం, కందిపప్పు, వంట నూనె, పాలు, గుడ్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన వాటా కాగా రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, బెల్లం, వేరుశనగ చిక్కీలు మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం మోపనుంది. అయినా ఆరోగ్యవంత సమజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

తల్లీబిడ్డలకు ఆరోగ్యానికి చక్కని ఆహారం..



టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్)లో అందిస్తున్న పది రకాల సరుకులు చాలా నాణ్యంగా ఉన్నాయి. తల్లి సక్రమంగా తీసుకుంటే తల్లి, బిడ్డల ఆరోగ్యం చక్కగా ఉంటుంది. గర్భిణీ సమయంలో మహిళల్లో రక్తహీనత వస్తుంది. దానిని నివారించడానికి ఇది మంచి ఆహారం.

మహ్మద్ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పేదలకు దివ్య ఔషధం..



టీహెచ్‌ఆర్‌లో ఉన్న సరుకులను బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి తినడం పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలకు అసాధ్యం. ఈ ఆహారం తీసుకున్న తరువాత నా ఆరోగ్యం బాగుంది. బిడ్డకు పాలు సక్రమంగా ఇవ్వగలుగుతున్నాను.

సాకా లలిత, బాలింత

బిడ్డ ఆరోగ్యంగా పుడతాడు..



టీహెచ్‌ఆర్ తీసుకున్న గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఆహారం తీసుకున్న తరువాత నేను చాలా చురుగ్గా ఉన్నాను. ఇంత మంచి కార్యక్రమం అమలు చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాను.

తాడి శిరీష, లక్ష్మీపాలెం, గర్భిణి

మహిళా పక్షపాతి సీఎం జగన్



వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: మహిళల ఖాతాల్లో వరుసగా నాలుగో విడత సున్నా వడ్డీ సొమ్ములు జమ చేసి మహిళల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరున అమలు చేసి అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక పరిపుష్టి కలుగజేశారన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, అమ్మ ఒడి పథకాలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అగ్రవర్ణ పేదలను గుర్తించిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. నవరత్నాల పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వినిస్టన్‌బాబు కొనియాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తు చేశారు. 2024లో సీఎం వైఎస్ జగ్‌మోహన్‌రెడ్డికి మద్దతు గా నిలవాలని రాష్ట్ర ప్రజలు కృత నిశ్చయంతో ఉన్నారని వినిస్టన్‌బాబు పేర్కొన్నారు.

గ్రంథపాలకుల దినోత్సవం

ఆకివీడు: ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దేశ గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షతవహించిన ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ గ్రంథాలయాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. పుస్తకం చదడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, పుస్తకం చదవడం ఎంత ముఖ్యమో తెలుస్తుందన్నారు. పుస్తకాల్ని సేకరించి, భద్రపరచే ప్రతి వ్యక్తీ గ్రంథపాలకుడేనని చెప్పారు. గ్రంథపాలకుల సేవలు ఎనలేనివని కొనియాడారు. లైబ్రేరియన్ ఫణి రాజు మాట్లాడుతూ పుస్తకాల్ని భద్రపరచడం ఒక కళన్నారు.

ఛాంబర్ కళాశాలలో 'నాభూమి–నా దేశం'



మొక్కలు నాటుతున్న చైర్మన్, ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో నా భూమి–నా దేశం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం మొక్కలు నాటారు. కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఇలాంటి సమాజాభివృద్ధికి పాటుపడే కార్యక్రమాల్లో పాల్గొని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె.రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యూత్ ఫెస్ట్



యూత్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మన్నా చర్చ్ లో శనివారం యూత్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత బాధ్యతగా నడుచుకుని భవిష్యత్‌లో స్థితప్రజ్ఞులు కావాలని ఆకాంక్షించారు. యువత వయసులో ప్రతి ఒక్కరికి అనేక కోరికలు ఉంటాయని, రంగుల లోకం మాయలోకం లాంటిదని గుర్తుంచుకోవాలని అన్నారు. యువత బాధ్యతగా నడుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన కోరారు. యువకులుగా ఉన్నప్పుడు మంచి బైక్ కొనుక్కోవాలని, సంతోషంగా ఆనందంగా తిరగాలని ప్రతి ఒక్కరు కోరుకోవడం సహజమని, కాని రంగుల లోకంలో మాత్రం ఎవరు విహరించవద్దని ఆయన పేర్కొన్నారు. యువత చేతుల్లోనే కుటుంబ, రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మన్నా చర్చ్ లో ప్రతీ సంవత్సరం యూత్ ఫెస్ట్‌ను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం



వెలి బాధితులతో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యురాలు సత్య సుధామ

పెనుగొండ: మండలంలోని నడిపూడి శివారు మిద్దేవారి పాలెంలో సామాజిక బహిష్కరణ బాధితులకు అండగా నిలుస్తామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ సభ్యురాలు సత్య సుధామ జిల్లెళ్ల అన్నారు. శనివారం మిద్దేవారి పాలెంలో వెలి బాధితులను పరామర్శించి, సంఘటనలపై విచారణ నిర్వహించారు. బాధితులకు తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టరుకు సూచించామన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. బాధితులకు అండగా నిలిచిన జిల్లా కలెక్టరుకు, సబ్ కలెక్టరు, ఎస్పీ, డీఎస్పీలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారన్నారు. అధికారులు మానవత్వంతో స్పందించారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు కార్యదర్శి రాజారావు కటికతల, కొల్లాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఆంగ్ల పరిజ్ఞానం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రేష్మీగేరా

సాక్షి, భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆంగ్లభాషను చక్కగా వినడం, మాట్లాడడం వంటి నైపుణ్యాన్ని అధ్యాపకులు అందించాలని ఢిల్లీకి చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) అకడమిక్ హెడ్ రష్మీ గేరా అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులు, టోఫెల్ వంటి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలా శిక్షణ అందించాలని అంశంపై శనివారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ఇంగ్లీష్ భాషలో వస్తున్న ఉపన్యాసంలోని మూలాలను బాగా అర్థం చేసుకునేలా విద్యార్థి శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, నడింపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో మహిళ మృతదేహం లభ్యం

కాళ్ల: పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. కాళ్ల మండలం సీసలి గ్రామ పరిధిలో కె.లంక పంట కాలువలోకి శనివారం ఉదయం 9 గంటల సమయంలో తూముల వద్ద గుర్రపు డెక్కలకు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసుగల మహిళ మృతదేహం అడ్డుపడి ఉందన్నారు. మెరూన్ కలర్ జాకెట్, ఆకుపచ్చ, పసుపు ముదురు ఆకుపచ్చ రంగు డిజైన్ గల పాలిస్టర్ దుస్తులు ధరించి ఉన్న మృతదేహం పూర్తిగా పాడైందని తెలిపారు. వీఆర్వో బొల్లి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సర్వాంగసుందరంగా పార్కు

- రూ 1.14 కోట్లతో అభివృద్ధి పనులు
- పెరిగిన పర్యాటకుల సంఖ్య



మూతపడి కళావిహీనంగా ఉన్న కాటన్‌పార్కు (ఫైల్)



అభివృద్ధి పనులు చేసిన తరువాత పిల్లలతో కళకళలాడుతున్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలో ప్రధాన ప్రాంతంలో ఉండి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న కాటన్‌పార్కు సర్వాంగ సుందరంగా తయారైంది. గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా మూతపడ్డ పార్కును రూ 1.14 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేశారు. పనులు శరవేగంగా పూర్తి చేయడంతో పార్కు ప్రస్తుతం సర్వాంగ సుందరంగా తయారైంది. దీంతో పార్కుకు ప్రతీరోజూ వచ్చే సందర్శకుల సంఖ్య కూడా పెరిగింది. దీంతో ఉదయం, సాయంత్రపు వేళల్లో పార్కు జనంతో కళకళలాడుతోంది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్‌పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్యపార్కు. కాటన్ పార్కు శిథిలమై కొన్ని సంవత్సరాలుగా మూతపడింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టిపెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును అభివృద్ధి చేశార్పు.

మారిన పార్కు రూపురేఖలు..

భారీగా నిధులు వెచ్చించి అభివృదిధ్ పనులు చేపట్టడంతో పార్కు రూపురేఖలు పూర్తిగా మారాయి. రూ.48.26 లక్షలు 14వ ఆర్థికసంఘ నిధులతో పార్కులో సుందరీకరణ పనులు నిర్వహించారు. రూ.12.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తోఆటవస్తువులు, టాయిలెట్స్ నిర్మించారు. రూ 9.39 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో మొక్కలు, బ్యూటిఫికేషన్ వర్క్ చేశారు. ఈ పనులు మాత్రం కొద్దిమేర పెండింగ్‌లో ఉన్నాయి. ఇక మరో రూ.11.73 లక్షలు 15వ ఆర్థికసంఘ నిధులతో పార్కులో ఫ్లాట్‌ఫామ్ మొత్తం ఆధునికీకరించారు. రూ.19.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.11 లక్షలు మున్సిపల్ జనరల్‌ఫండ్స్‌తో బస్టాండ్ ఎదురుగా ఉన్న 216 జాతీయరహదారి నుంచి నేరుగా పార్కుకు చేరుకోవడానికి నిడదవోలు–నరసాపురం కాలువపై కాలిబాట వంతెన నిర్మిస్తున్నారు. ఈ పనులు శర వేగంగా సాగుతున్నాయి. పనులు చివరి దశలో ఉన్న ఈవంతెన అందుబాటులోకి వస్తే పార్కులోకి వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

వేగంగా అభివృద్ధి



కాటన్‌పార్కును అభివృద్ధి చేశాం. పార్కులోకి సందర్శకుల సంఖ్యను మరింత పెంచడానికి పంటకాలువపై వంతెన నిర్మిస్తున్నాం. పార్కు వద్ద లైబ్రరి నిర్మాణం పనులు సాగుతున్నాయి. పిల్లలు చదువుకోవడానికి, ఆహ్లాదంగా ఆడుకోవడానికి ఒకేచోట వేదిక కల్పించే ప్రయత్నం ఇది. ఈ విధంగా అవకాశం ఉన్న మేర అభివృద్ధి పనులు చేస్తున్నాం.

–ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల దృశ్యం

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈశా గ్రామోత్సవం ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల స్ఫూర్తిని పునరుజ్జీవింపచేయడానికి ఈ గ్రామోత్సవాలు దోహదపడతాయని భీమవరం హాస్పటల్ ఎండీ డాక్టరు గోపాలరాజు, లయన్స్ క్లబ్ చైర్మన్ కృష్ణంరాజు అన్నారు. రెండు రోజుల క్రీడల్లో తొలిరోజు పురుషులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 26 జట్లు పాల్గొన్నాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశా జిల్లా సమన్వయకర్త డాక్టరు విజయ మాట్లాడుతూ క్లస్టర్, డివిజన్, ఫైనల్ స్థాయిలో 3 దశలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.56 లక్షల నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం బాలికలు, యవతులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, ఉపసర్పంచ్ వెంకటరాజు, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, భీమవరం: అఖిలభారత స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సావాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటేవారితోటలోని కళాశాల బీసీ బాలుర హాస్టల్ వద్ద ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని చెల్లబోయిన రంగారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ సేవలను కొనియాడారు.

యువతి అదృశ్యం

ఆకివీడు: స్థానిక సాయినగర్‌కు చెందిన యువతి (21) ఈనెల 11 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి డి.వెంకటేశ్వరరావు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. స్థానిక క్లాత్ మర్చంట్ షాపులో పనిచేస్తోన్న ఆమె కడుపు నొప్పిగా ఉందని షాపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఉండి: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరేడు గ్రామానికి చెందిన వివాహిత పట్ల పక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వివాహితుడు పిట్టా సాయి అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

కాలేజీలో విద్యుత్ మోటార్ చోరీ

ఆకివీడు: మండలంలోని దుంపగపడలో ఉన్న ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం విద్యుత్ మోటార్ చోరీకి గురైందని ప్రిన్సిపాల్ ఎం.బ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సత్యసాయి శనివారం తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు కాలేజీ తాళాలు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారని, విద్యుత్ మోటార్‌ను మాత్రమే తీసుకుపోయారని పేర్కొన్నారు.

కొట్లాటలో ఇద్దరిపై కేసు

ఉండి: చెరుకురసం బండి వద్ద ధర విషయంలో వివాదంపై కొనుగోలుదారు, విక్రేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నార్పీ అగ్రహారం పాలకేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై చెరుకురసం అమ్ముకుంటున్న కమతం రమేష్ అనే వ్యక్తితో పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన యండవల్లి ప్రదీప్ అనే వ్యక్తి చెరుకురసం కొనేందుకు వచ్చి ధర విషయంలో గొడవపడ్డాడు. ఇద్దరూ కొట్టుకోని గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.